
నల్లవాగు ప్రాజెక్టులో వేసిన కట్టలు

ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్ కబ్జా

'నల్లవాగు' పరిధిలో కట్టలు వేసి పొలాలుగా మారుస్తున్న వైనం

వరద ప్రవాహానికి ఆటంకం

కల్హేర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నల్లవాగు ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు కబ్జాలకు పాల్పడుతున్నారు. కట్టలు నిర్మించి పొలాలుగా మార్చుతున్నారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల పరిధిలో నల్లవాగు ప్రాజెక్టు ఉంది. దీనికింద 13 గ్రామాల పరిధిలో 5,100 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు అతిథి గృహం సమీపంలో కొందరు కబ్జాకు పాల్పడుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు ఎగువన సిర్గాపూర్, చీమల్‌పాడ్, సంగెం, గరిడేగామ్, పెద్దముబారక్‌పూర్, చిన్నముబారక్‌పూర్ తదితర గ్రామాలకు చెందినవారు ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూముల్లో పెద్ద కట్టలు వేసి పొలాలుగా మారుస్తున్నారని వారు తెలిపారు. దీంతో ప్రాజెక్టు కుంచించుకుపోతోందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిపారుదలశాఖ అధికారులు రోజూ చూస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. దీనిపై ప్రాజెక్టు డీఈ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేలిన తూటా



మెదక్ జిల్లాలో 'రియల్' మర్డర్

- కాపు కాసి కాంగ్రెస్ నాయకుడిపై కాల్పులు
- హత్యకు పకడ్బందీ పథకం..
- కొద్ది నెలల నుంచి రెక్కీ
- నేడు అనిల్ పుట్టిన రోజు
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు
- నిందితుల కోసం పోలీసు బృందాలు

మెదక్/కొల్చారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సుమారు పద్దెనిమిది ఏళ్ల తర్వాత మెదక్ జిల్లాలో తుపాకీ కాల్పులు కలకలం సృష్టించాయి. అప్పట్లో నక్సలైట్ల సంచారం ఉన్న సమయంలో తుపాకులు ఎక్కుపెట్టుకున్న ఘటనలు చోటు చేసుకునేవి. ఆ తర్వాత పరిస్థితి ప్రశాంతంగా మారింది. అప్పుడప్పుడు హత్యలు జరిగినా.. అవి తుపాకుల జోలికి వెళ్లకుండానే జరిగాయి. కానీ, చాలా ఏళ్ల తర్వాత దుండగులు కాంగ్రెస్ నేతపై నాలుగు రౌండ్ల కాల్పులు జరిపి హత్య చేయడంతో మెతుకు సీమ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మొదట రోడ్డు ప్రమాదంగా భావించినా.. తర్వాత అది పక్కా పథకం ప్రకారం జరిగిన మర్డర్‌గా తేలింది. దుండగులు దగ్గర నుంచి నాలుగు రౌండ్ల కాల్పులు జరిపినట్లు పోలీసులు తేల్చారు. ఈ మేరకు అక్కడ కాల్చిన


రోదిస్తున్న అనిల్ కుటుంబసభ్యులు

తూటాలు వారు స్వాధీనం చేసుకున్నారు.

ఎవరెవరిని కలిశారు..!

అనిల్ హత్య ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. కేసును పరిశోధించేందుకు నాలుగు బృందాలను రంగంలోకి దింపారు. ఇప్పటికే రాయలసీమ, హైదరాబాద్‌కు చెందిన కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అలాగే, అనిల్ హైదరాబాద్ గాంధీభవన్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ సమావేశానికి హాజరైన తర్వాత ఎవరెవరిని కలిశారు. ఏ ప్రాంతంలో తిరిగారు వంటి విషయాలపై పోలీసులు దృష్టి పెట్టారు. అతని కాల్ డేటాను సేకరించే పనిలో ఉన్నారు. రాజకీయంతో పాటు భూ దందాలు కూడా చేసే అనిల్ సెల్‌ఫోన్ కాల్‌డేటా విశ్లేషిస్తే విషయాలు తెలుస్తాయని భావిస్తున్నారు. దుండగులు కొన్ని నెలల క్రితమే అనిల్‌ను హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి ఆయన అదే మార్గంలో వస్తాడని ముందుగానే కాపు కాచి, సుమారు 8.15 గంటల ప్రాంతంలో అనిల్‌ను ఆటకాయించి, కారు స్లో చేయగానే కాల్పులు ప్రారంభించినట్లు పోలీసులు చెబుతున్నారు. అతని కుడిచేతిపై


మృతుడు అనిల్

మిగతా 8వ పేజీలో

రియల్ దందానే కారణమా..?

కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మరెల్లి అనిల్‌ది సామాన్య మధ్య తరగతి కుటుంబం. ముగ్గురు సంతానంలో మొదటివాడైన అనిల్ కొల్చారం మండలంలోని సంగాయిపేటలో పెట్రోల్ బంక్ నడపడంతో పాటు రాజకీయం, రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేసేవాడని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో భూదందాలు, సెటిల్‌మెంట్లు చేయమని కూడా అతని దగ్గరకు పలువురు వచ్చేవారు. ఈ క్రమంలోనే రాయలసీమకు చెందిన ఓ వ్యక్తితో వివాదం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి కారులో వస్తుండగా, కాపు కాచి కాల్పులు జరిపి చంపేసినట్లు పోలీసులు చెబుతున్నారు. సమీపంలోని ఓ రైస్ మిల్ సీసీటీవీ ఫుటేజీలను చూసి పోలీసులు అంతకు ముందే అక్కడ కారులో వేచి ఉన్న దుండగులు అనిల్ కారును అడ్డగించి, కాల్చి చంపినట్లు నిర్ధారణకు వచ్చారు. మండలంలోని అప్పాజీపల్లిలోనూ ఓ భూ వివాదం విషయంలో అనిల్‌పై కేసు నమోదైనట్లు తెలిసింది. దుండగులు కాల్పులు జరిపిన సమయంలో అనిల్ తన చేతిపై ఓ ఫోన్ నంబర్ రాసుకున్నట్లు చెబుతున్నారు.

విద్య, వైద్య కేంద్రంగా అందోలు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అందోలు నియోజకవర్గాన్ని విద్య, వైద్య కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు విద్యాసంస్థలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో జేఎన్టీయూతో పాటు మూడు పాలిటెక్నిక్ కాలేజీలు, మహిళా డిగ్రీ కాలేజీ, పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయించానని గుర్తుచేశారు. ఈసారి ఆరోగ్య శాఖ మంత్రిగా నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేయించానని చెప్పారు. నర్సింగ్ కాలేజీకి అనుబంధంగా 100 పడకల ఆస్పత్రి, 50 పడకలతో మదర్-చైల్డ్ కేర్ సెంటర్, వట్‌పల్లిలో 50 పడకల ఆస్పత్రితోపాటు పలు పీహెచ్‌సీలు, హెల్త్ సబ్‌సెంటర్లు, రెండు ట్రామాకేర్ సెంటర్లు మంజూరు చేయించానని పేర్కొన్నారు. రూ. 189 కోట్లతో సింగూరు కాల్వలకు లైనింగ్ పనులు చేయిస్తున్నామని, పలు రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని తెలియజేశారు. జోగిపేటను అనుసంధానించడానికి రూ. 90 కోట్లతో మంజీరా నదిపై నూతన బ్రిడ్జిని నిర్మిస్తున్నామని వివరించారు. అనంతరం ఆయన మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణ పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు త్రిష దామోదర్, ఆర్డీవో పాండు, నాయకులు సురేందర్ గౌడ్, ప్రవీణ్ ఉన్నారు.


కస్తూర్బా పాఠశాలలో కిచెన్‌ను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్


గుమ్మడిదలలో బోనాల ఊరేగింపు

చల్లగా చూడమ్మా.. ఎల్లమ్మ తల్లి

గుమ్మడిదలలో వైభవంగా బోనాల ఉత్సవాలు.. పోతురాజుల విన్యాసాలు, ఎడ్లబండ్ల పోటీలు

గుమ్మడిదల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డప్పు చప్పుళ్ల, పోతరాజుల విన్యాసాలతో గుమ్మడిదల హోరెత్తింది. ఎల్లమ్మ తల్లి చల్లగా చూడమ్మా.. అంటూ భక్తి శ్రద్ధలతో పల్లె జనులు వేడుకున్నారు. మండల కేంద్రంలో మంగళవారం బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు పట్టువస్త్రాలు ధరించి, బోనాలు తలపై ఎత్తుకుని ఎల్లమ్మ తల్లికి సమర్పించడానికి ఊరేగింపుగా తరలివచ్చారు. అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చల్లగా చూడమని మొక్కుకున్నారు. రంగురంగుల వళ్లెలు ధరించి, నెత్తిన తాటి చీపుర్లు, చంకలో తుంపలతో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. పూలు, రంగుల కాగితాలతో అందంగా ముస్తాబుచేసిన బండ్లపై అమ్మవారి చిత్రాలన ఉంచి ఊరేగించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన రైతులకు బహుమతులు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్దుల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నిఏర్పాట్లు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో గ్రామ ప్రధాన వీధులు నిండిపోయాయి.

రాగిజావ ఇవ్వరా?

గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ

ఈ విద్యాసంవత్సరం నిలిచిన సరఫరా



సంగారెడ్డి అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు మరింత పౌష్టికాహారాన్ని అందించేందుకు గతేడాది ప్రభుత్వం రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు పీఎం పోషన్ పథకం కింద రాగిజావ పంపిణీ చేశారు. గత విద్యాసంవత్సరం ముగింపు వరకు విద్యార్థులకు రాగిజావను అందించారు. కానీ, ఈ విద్యాసంవత్సరం ఇప్పటికీ ప్రారంభించలేదు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నుంచి రాగి పిండి, బెల్లం ప్యాకెట్లు ఇంకా సర్కారు బడులకు సరఫరా కాలేదని తెలుస్తున్నది.

వారంలో మూడు రోజులు

గతేడాది విద్యార్థులకు అందజేసిన రాగిజావ, బెల్లం పొడి పంపిణీకి సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు చేయూతనిచ్చింది. వారంలో మధ్యాహ్న భోజనంలో గుడ్లు పెట్టని మూడు రోజుల్లో ప్రతీ విద్యార్థికి 10 గ్రాముల రాగి పొడి, 10 గ్రాముల బెల్లం పొడి కలిపిన జావను అందించారు. ఉదయం విరామ సమయంలో రాగిజావ అందించడంతో పోషకాలు అందుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా రాగిజావ పంపిణీకి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గం'జాయ్'పై కొరడా

వినియోగంపై ఉక్కుపాదం.. ఇకపై ఉపయోగించినా కేసులు

యూరిన్ టెస్ట్ కిట్ల ద్వారా నిర్ధారణ.. త్వరలో జిల్లాకు చేరనున్న కిట్లు

సాంకేతికత ఆధారంగా సంగారెడ్డి జిల్లా పోలీసుల కొత్త వ్యూహం

సంగారెడ్డి క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పోలీసులు గంజాయి వాడకంపై కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. ఇప్పటివరకు గంజాయి విక్రేతలపై మాత్రమే కేసులు నమోదు చేస్తుండగా, ఇకపై గంజాయి తాగేవారిపైనా కేసులు నమోదు చేయనున్నారు. ఇందుకోసం యూరిన్ టెస్ట్ కిట్‌లను ఉపయోగించి డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో పరీక్షలు నిర్వహించనున్నారు.

గంజాయి నిర్మూలనకు కొత్త టెక్నాలజీ

గంజాయి వాడకాన్ని అరికట్టేందుకు పోలీసులు యూరిన్ టెస్ట్ కిట్‌లను ప్రవేశపెడుతున్నారు. ఈ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ వచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తారు. అంతేకాకుండా, గంజాయికి బానిసలైన వారిని పునరావాస కేంద్రాలకు పంపించి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా వ్యసనం నుంచి దూరం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ చర్యల ద్వారా గంజాయి మూలాలను గుర్తించి, సరఫరాదారులను పట్టుకునేందుకు కూడా అవకాశం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

విద్యార్థులు, కార్మికులే లక్ష్యం

సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, పటాన్‌చెరు, జిన్నారం, ఇస్నాపూర్ వంటి ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు, ఇంజనీరింగ్ విద్యాసంస్థలు ఉండటంతో కార్మికులు, విద్యార్థులే గంజాయి స్మగ్లర్ల ప్రధాన లక్ష్యంగా మారారు. పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, రాజస్థాన్, ఝార్ఖండ్, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి వచ్చిన కార్మికులకు గంజాయి విక్రయిస్తున్నారు. అలాగే, విద్యార్థులకూ గంజాయి అలవాటు చేస్తున్నారు. వినోదం కోసం గంజాయికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

ఒడిశా నుంచి రవాణా

గంజాయి స్మగ్లర్లు సినిమా తరహాలో గంజాయిని రవాణా చేస్తున్నారు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ప్రత్యేకంగా తయారుచేసిన వాహనాల్లో, కూరగాయల కింద గంజాయి ప్యాకెట్లను దాచి తరలిస్తున్నారు. ఈ గంజాయిని సంగారెడ్డి జిల్లాతో పాటు, జహీరాబాద్ మీదుగా మహారాష్ట్రలోని ముంబై, పూణే, లాతూర్ వంటి ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో పటాన్‌చెరు రుద్రారం సమీపంలోని గీతం విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించి భారీగా గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.


చిరాగ్‌పల్లి వద్ద పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

గతేడాది 79 మంది అరెస్ట్

సంగారెడ్డి జిల్లాలో గత సంవత్సరం గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి ఎక్సైజ్ పోలీసులు 27 కేసులు నమోదు చేశారు. పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 10, సంగారెడ్డి పరిధిలో 7, నారాయణఖేడ్‌లో 3, అందోల్‌లో 4 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో రూ.10.11 కోట్ల విలువైన 209.162 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని దహనం చేశారు. ఇవేకాకుండా జిల్లా పోలీసులు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 26 కేసులు నమోదు చేశారు. 79 మంది నిందితులను అరెస్ట్ చేయగా 509 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దు

ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలుగా మారొద్దు. గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి విద్యార్థులు, కార్మికులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. జిల్లాలో గంజాయి మహమ్మారిని తరిమికొట్టేందుకు పోలీసు యంత్రాంగం కృషిచేస్తోంది. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాలకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా 8712656777 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

-పరితోష్ పంకజ్, సంగారెడ్డి ఎస్పీ


మెదక్‌లో కూల్చివేస్తున్న అనుమతి లేని భవనం

అక్రమ కట్టడాల కూల్చివేత

మెదక్ మున్సిపాలిటీ/జిన్నారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మెదక్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనాన్ని మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ భూపతి, సూపర్‌వైజర్ ప్రభాకర్, టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ ఆధ్వర్యంలో స్లాబ్ వరకు నిర్మించిన జీ ప్లస్ వన్ భవనాన్ని కూల్చివేశారు. అలాగే, గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. అల్లీనగర్ శివారులోని సర్వే నంబర్ 27లో నిర్మించిన రెండు గదులు, ఆరు బేస్మెంట్‌లను ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది కూల్చివేయించారు.

న్యాయ సహాయంతో మహిళలకు భరోసా

సమీక్షా సమావేశంలో సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మహిళలకు న్యాయ సహాయ సేవలు మరింత విస్తృతంగా అందించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా మహిళలు, శిశువులు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌లకు అందిస్తున్న న్యాయపరమైన సేవలపై అవగాహన కల్పించాలన్నారు. సఖీ కేంద్రం ద్వారా మహిళల హక్కుల పరిరక్షణ, జిల్లా మహిళా సాధికారత ద్వారా జరుగుతున్న సేవలు, నైతిక న్యాయ సహాయలపై సమీక్షించాలని అధికారులకు సూచించారు. ఐసీడీఎస్ ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ వాత్సాల్య పథకం ద్వారా పిల్లలకు అందించే స్పాన్సర్‌షిప్పులు, దత్తత, బాలసదనాలు, శిశురక్షణ కేంద్రాల నిర్వహణపై సమీక్షించి ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



అవార్డు అందుకుంటున్న సంఘం చైర్మన్ రమేష్

కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘానికి అవార్డు

పాపన్నపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘానికి అవార్డు లభించింది. ఈ మేరకు సంఘం చైర్మన్ త్యార్ల రమేష్‌కు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సహకార శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, నాబార్డ్ జీఎం ఉదయ్ భాస్కర్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. నాబార్డ్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘాన్ని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. సొసైటీకి వచ్చిన లాభాల్లో సుమారు రూ.17.50 లక్షలను సభ్య రైతులకు 10 శాతం చొప్పున వారి ఖాతాల్లో జమ చేశారు. దీంతో పాటు రైతులకు రుణాల పంపిణీ, వాటి రికవరీ, పెట్రోల్, డీజిల్ బంకుల నిర్వహణ, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఫర్టిలైజర్ సేవలు తదితర విభాగాల్లో సొసైటీ చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసినట్లు చైర్మన్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అవార్డు తన బాధ్యతలను మరింత పెంచిందని, సొసైటీ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని చెప్పారు.

ఎనిమిది కేజీల ఎండు గంజాయి పట్టివేత

రామచంద్రాపురం టౌన్ జూలై 15 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఎండు గంజాయి అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా మన్‌హళ్లి అనే గ్రామానికి చెందిన ఖురేషి షబ్బీర్ అలీ అనే వ్యక్తి ఒరిషా రాష్ట్రం నుంచి ఎనిమిది కేజీల ఎండు గంజాయి తెచ్చి మంగళవారం సాయంత్రం ఇక్రిశాట్ సమీపంలోని పారగాన్ చెప్పుల కంపెనీ ఎదురుగా అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఖురేషి షబ్బీర్ అలీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకున్నారు.

రెంటికి చెడ్డ రేవడి..!

నాన్‌వెజ్ మార్కెట్ ప్రారంభంపై సందిగ్ధత



చేర్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని అంగడిబజార్‌లో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ నాన్‌వెజ్ మార్కెట్ భవనం ప్రారంభంపై నెలకొన్న సందిగ్ధతతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించినా.. ప్రజా ప్రతినిధులు, అధికారుల అలసత్వం వల్ల నిరుపయోగంగా మారింది. మున్సిపల్ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి ఈ భవనాన్ని నిర్మించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో మాంసం దుకాణాలు రోడ్డు పక్కనే కొనసాగుతున్నాయి.

గతంలో లక్షకుపైగా ఆదాయం

చేర్యాల అంగడిబజార్‌లో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఆదాయ వనరుల కోసం కూరగాయలు, మాంసం, ఇతర దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. దీంతో మున్సిపాలిటీకి నెలకు లక్షకుపైగా ఆదాయం లభించేది. సిద్దిపేట జిల్లాలో విలీనం తర్వాత 2018లో చేర్యాల మున్సిపాలిటీగా మారింది. అప్పుడు మంత్రి హరీశ్‌రావు చొరవతో చేర్యాలలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే, భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా, స్థల ఎంపిక వివాదాస్పదమైంది.

స్థానికుల అసంతృప్తి

ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ భవన పనులు పూర్తైతే పట్టణానికి ల్యాండ్‌మార్క్‌గా నిలిచేది. కానీ ప్రధాన దారి సమస్య పరిష్కారం కాకపోవడంతో కేవలం రేకులషెడ్డుతో కూడిన నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని మాత్రమే పూర్తి చేశారు. శివారులో ఉండాల్సిన నాన్‌వెజ్ మార్కెట్‌ను పట్టణం నడిబొడ్డున నిర్వహించాల్సిన దుస్థితి నెలకొనడంతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. కేవలం మాంసం దుకాణాలు కొనసాగే రేకుల కప్పు భవనం కోసం మున్సిపల్ కార్యాలయం, ఆర్‌సీసీ భవనాలను అనవసరంగా కూల్చివేసి, అంగడిబజార్ చౌరస్తాను రెంటికి చెడ్డ రేవడిలా మార్చారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధికారంలోకి వస్తే అస్తవ్యస్తంగా మారిన నాన్‌వెజ్ మార్కెట్ బిల్డింగ్‌ను కూల్చివేసి, అంగడిబజార్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రజోపయోగకర భవనాలను నిర్మించి సుందరీకరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని కూల్చివేయిస్తారా, లేక ప్రారంభానికి చర్యలు చేపడతారా అనేది చర్చనీయాంశంగా మారింది.

వ్యాపారులు, ప్రజల ఇక్కట్లు

షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేసిన నాటి నుంచి మాంసం దుకాణాలు రోడ్డు పక్కనే ఆరుబయట కొనసాగుతున్నాయి. స్లాటర్‌హౌస్ లేకపోవడంతో దుకాణాల ఆవరణలోనే మేకలు, గొర్రెలు, కోళ్లను వధిస్తున్నారు. రక్తపు వ్యర్థాలతో పాటు అస్తవ్యస్తమైన పారిశుధ్య పనులతో అంగడిబజార్ పరిసరాలు కంపుకొడుతున్నాయి. వైరాలను పక్కన పెట్టి, అంగడిబజార్ చౌరస్తాకు పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పర్యవేక్షించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

చేగుంట జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా నిరంతరం అధికారులు పర్యవేక్షణ జరపాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చేగుంట మండల పరిధిలోని పులిమామిడి, బోనాల గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు త్వరితగతిన పనులు పూర్తయ్యే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మెదక్ జిల్లాను ముందు వరుసలో ఉంచాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి ప్రశ్నలు సమాధానాలతో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, హౌసింగ్ ఏఈ రియాజ్, ఎంపీ ఓ ప్రశాంత్ ,పంచాయతీ కార్యదర్శులు సరిత రేఖ తదితరులు ఉన్నారు.



పులిమామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ఝరాసంగం, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీలపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శివయ్య(48) మంగళవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల చికిత్స నిమిత్తం ఝరాసంగం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతిడికి ఇద్దరు కుమారులు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రాంచెందర్ మాట్లాడుతూ శివయ్య కుటుంబానికి ప్రభుత్వ పరంగా రూ, 25 లక్షలు అందజేయడంతో పాటు ఇంట్లో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో విధులు చేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సకాలంలో వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విద్యుదాఘాతంతో రెవెన్యూ రికార్డు అసిస్టెంట్ ..

చేగుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పొలం వద్ద స్టార్టర్ డబ్బా మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం చేగుంట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో జరిగింది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మర్పల్లి శ్రీనివాస్ (35) పొలం వద్ద స్టార్టర్ డబ్బా వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్‌కి భార్య రమ్య, ఇద్దరు కుమారులు భరత్, దీక్షిత్‌లు ఉన్నారు. మృతుడి సోదరుడు బిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు ఎస్సై చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు .శ్రీనివాస్ మృతి విషయం తెలుసుకున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, ఇబ్రహీంపూర్ గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా రూ.20 వేలు సాయంతో పాటు అదనంగా రూ.10 వేలు శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్‌లు శ్రీకాంత్, షేక్ కరీం, శ్రీనివాస్‌లు ఉన్నారు.

సిద్ధాపూర్ తండాలో ఉపాధి కూలీ..

కోహీర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీ పనులు చేస్తూ ఓ వ్యక్తి చనిపోయాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని సిద్దాపూర్ తండాలో ఉపాధి కూలీ భీమ్లా నాయక్ (50) మంగళవారం ఉదయం ఉపాధి పనులు చేస్తూ సొమ్మసిల్లి పడిపోయి మృతి చెందాడు. భీమ్లా నాయక్ రోజువారి మాదిరిగానే మంగళవారం ఉదయం కూడా ఉపాధి పనులకు వెళ్లాడు. తాండ శివారులో మళ్లింపు కాలువ పనులు చేస్తుండగా భీమ్లా నాయక్ సొమ్మసిల్లి కింద పడిపోయాడు. ఇది గమనించిన మిగతా కూలీలు అతడిని చికిత్స నిమిత్తం గ్రామానికి తీసుకువచ్చారు. అప్పటికే భీమ్లా నాయక్ మృతి చెందాడు. భీమ్లా నాయక్‌కి భార్య, ఓ కొడుకు ఉన్నాడు.విషయం తెలుసుకున్న ఏపీవో సునందరావు సిద్ధాపూర్ తాండాకు వెళ్లి మృతి చెందిన ఉపాధి కూలీ భీమ్లా నాయక్ వివరాలను తెలుసుకొని సంబంధిత ఉపాధి జిల్లా ఉన్నంత అధికారులకు తెలియజేశారు. పనులు చేస్తూ అకస్మాత్తుగా మృతి చెందిన భీమ్లా నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని తాండ గిరిజన ఉపాధి కూలీలు ప్రభుత్వాన్ని కోరారు.

కూతురితో కలిసి వివాహిత అదృశ్యం

పెద్దశంకరంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తన ఐదు సంవత్సరాల కూతురుతో కలిసి వివాహిత అదృశ్యమైంది. పెద్దశంకరంపేట పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పెద్దశంకరంపేట గ్రామానికి చెందిన చీలపల్లి రేణుక, భర్త సాయిలు, తన ఐదు సంవత్సరాల కూతురుతో కలిసి పీర్ల పండుగ కోసం పెద్దశంకరంపేటకు ఈనెల 6న వచ్చారు. పండుగ అనంతరం వారు హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో భర్త సాయిలు తన అత్త బూదెమ్మకు ఫోన్ చేసి భార్య రేణుక, కూతురులు కనపడటం లేదని తెలిపాడు. దీంతో అత్త బూదెమ్మ తెలిసిన వారి దగ్గర, బంధువుల వద్ద వెతికింది. ఈ సందర్భంగా పెద్దశంకరంపేటలో బూదెమ్మ, తన కూతురు, మనుమరాలు కనపడటం లేదని ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో తాము కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

పాడి గేదెల చోరీ

మద్దూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో పాడి గేదెలను చోరికి గురయ్యాయి. మంగళవారం బాధిత రైతు మోత్కూరి పర్శరాములు తెలిపిన కథనం ప్రకారం.. ఆదివారం గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద పాడిగేదెలను కట్టేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారి పొలం వద్దకు వెళ్లి చూడగా రెండు గేదెలు కన్పించలేదు. చుట్టు పక్కల పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అక్కడ టాటా ఏస్ వాహనం టైర్ల ముద్రలు కన్పించడంతో అందులో తరలించినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. ఇదే గ్రామంలో కొద్ది రోజుల క్రితం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్‌వైర్ చోరికి గురవ్వడంతో పాటు ట్రాక్టర్ల బ్యాటరీలు చోరికి గురయ్యాయి. దీంతో బాధిత రైతులు వరుస చోరీల ఘటనలతో భయాందోళన చెందుతున్నారు. పోలీసులు చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకుని రైతుల భయాందోళనల్ని తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

టేక్మాల్ జూలై 15 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ ఎక్సల్‌పై వెళ్తున్న వ్యక్తిని డీసీఎం ఢీ కొనడంతో అతడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవాం సాయంత్రం టేక్మాల్ మండలంలోని సాలోజీపల్లి గ్రామ శివారులో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పారం తాండాకు చెందిన నేనవత్ వాల్య(45) టేక్మాల్ నుంచి బోడ్మాట్‌పల్లి వైపు టీవీఎస్ ఎక్సల్‌పై వెళ్తుతుండగా డీసీఎం ఢీ కొనండంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలెసుకున్న టేక్మాల్ ఎస్సై క్రిష్ణ సంఘటన స్థలానికి చెరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నారాయణఖేడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని ఓ బియ్యం దుకాణంపై పౌర సరఫరాల శాఖ విజిలెన్ అండ్ టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రవాణాకు సహకరించిన ఐదు బైకులను సీజ్ చేశారు. విజిలెన్స్ అండ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ పట్టణంలోని సువర్ణ షెట్కార్ రోడ్డులోని విఠల్ బియ్యం దుకాణంలో రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు దుకాణంపై దాడి చేశారు. దాడుల్లో 37 సంచుల్లో ఉన్న సన్నబియ్యం, 17 సంచుల్లో నింపిన దొడ్డు బియ్యం కలిపి మొత్తం 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయి. పంచనామా నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుని స్థానిక పౌర సరఫరాల శాఖ గోదానికి తరలించారు. ఈ దాడుల్లో స్థానిక ఆర్ఐ మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో పంచనామ నిర్వహిస్తున్న అధికారులు

మెదక్ జిల్లాకు ముగ్గురి అధికారుల రాక

మెదక్ అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాకు బదిలీపై ముగ్గురు అధికారులు వచ్చారు. సంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా పని చేసిన గీత మెదక్ జిల్లా పరిషత్ కార్యాలయ డిప్యూటీ సీఈవోగా బదిలీపై వచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారిగా పని చేసిన దేవ్ కుమార్ మెదక్ .జిల్లా వ్యవసాయ అధికారిగా బదిలీ వచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డా. నితిన్ కబ్రా నియమితులయ్యారు. కొత్తగా జిల్లాకు వచ్చిన అధికారులు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

భలే సంపత్తి

ఉమ్మడి జిల్లాలో 33 ఏళ్లలో భారీగా పెరిగిన సాగు విస్తీర్ణం

- నాడు ఎకరమే.. నేడు ఒక్కో రైతు పదుల ఎకరాల్లో సాగు
- సంప్రదాయ పంటలకు స్వస్తి.. వాణిజ్య సాగుపై దృష్టి
- సీసీఐ మద్దతు ధరతో పత్తి రైతులకు మేలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో పత్తి సాగు గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు సంప్రదాయ పంటలకే పరిమితమైన ఈ ప్రాంత రైతులు, ఇప్పుడు పత్తిని ప్రధాన వాణిజ్య పంటగా స్వీకరించి, ఎకరం నుంచి పదుల ఎకరాలకు సాగును విస్తరించారు. మెళకువలు, బీటీ విత్తనాల రాకతో సాగులో విప్లవం వచ్చింది. దీంతో విత్తనాలు, మందుల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో దళారుల బారి నుంచి రైతులు విముక్తి పొంది, తమ శ్రమకు తగ్గ మద్దతు ధర పొందుతున్నారు. ఇది రైతులకు ఆర్థికంగా చేదోడుగా నిలుస్తోంది.

- మునిపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి)



ఉమ్మడి మెదక్ జిల్లాలో పత్తి సాగు మొదలై 33 ఏళ్లు పూర్తయ్యింది. ఒకప్పుడు శనగ, జొన్న, పెసర, మినుము వంటి పంటలు సాగు చేసిన రైతులు, ఇప్పుడు పత్తిని ప్రధాన వాణిజ్య పంటగా మార్చుకున్నారు. 1992లో వలస వచ్చిన కొంతమంది రైతులు ఇక్కడ భూములు కౌలుకు తీసుకొని పత్తి, మొక్కజొన్న సాగు చేయడంతో ఈ ప్రాంతంలో పత్తికి బీజం పడింది. అప్పట్లో స్థానిక రైతులు పత్తి సాగుపై పెద్దగా ఆసక్తి చూపలేదు. 2002లో కొందరు రైతులు ఒకటి, రెండు ఎకరాల్లో పత్తి సాగు మొదలుపెట్టారు. అప్పట్లో లూజు విత్తనాల కారణంగా దిగుబడులు తక్కువగా ఉండటం, ధరలు లేకపోవడంతో రైతులు నష్టపోయారు. దీంతో లూజు విత్తనాల(ఎల్‌కే 157)కు స్వస్తి పలికి 2004లో బీటీ విత్తనాలతో పంటల సాగుచేయడం మొదలు పెట్టారు. క్రమేణా పత్తి సాగు లాభసాటిగా మారడంతో సాగు విస్తీర్ణం పెంచుతూ వచ్చారు. ఒకప్పుడు ఎకరం వేసిన రైతులు కూడా ఏకంగా పదుల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు.

అప్పుడు రూ.100.. ఇప్పుడు రూ.901

గతంలో లూజు విత్తనాలు ఉండేవి. అప్పట్లో పురుగుల నుంచి పంటను కాపాడటానికి రైతులు తీవ్రంగా శ్రమించేవారు. అవి తక్కువ ధరకే దొరికినా, దిగుబడులు సరిగా వచ్చేవి కావు. బీటీ విత్తనాలు మార్కెట్‌లోకి రావడం.. బ్యాక్టీరియా, వివిధ పురుగుల నుంచి రక్షణ కల్పించడంతో రైతులు పత్తి సాగుకు ఆసక్తి చూపారు. బీటీ విత్తనాలతో పురుగు మందుల వాడకం కూడా కొంత తగ్గింది. 1992 నుంచి 2001 వరకు లూజు విత్తనాలను గోనె సంచుల్లో కిలోల రూపంలో విక్రయించేవారు. ఎకరానికి రెండు, మూడు కిలోల విత్తనాలు అవసరమయ్యేవి, కిలోకు రూ.100 చొప్పున విక్రయించేవారు. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా, నాన్ బీటీ విత్తనాల వల్ల పురుగుల నివారణకు అధికంగా మందులు వాడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి లాభాలు అంతంతమాత్రమే ఉండేవి. ఆ తరువాత పలు కంపెనీలు హైబ్రిడ్ విత్తనాలను బీటీగా మార్చడం రైతులకు కలిసి వచ్చింది. 2004లో పత్తి ప్యాకెట్ ధర రూ.650 ఉండగా, ప్రస్తుతం 900 గ్రాముల ప్యాకెట్ రూ.901గా ఉన్నది. పురుగు మందుల ధరలు కూడా గతంలో ఉన్న ధరల కంటే నాలుగు రెట్లు పెరిగాయి.

సీసీఐ మద్దతు ధర

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో సీసీఐ కేంద్రాలు ఉన్నప్పటికీ, మెదక్ జిల్లాలో మాత్రం 2014 వరకు ఏర్పాటు చేయలేదు. 1993లో క్వింటాల్ పత్తికి రూ.1600 ఉన్నది. ధర క్రమంగా పెరుగుతూ 2012లో రూ.3,700కు చేరింది. దళారుల బారి నుంచి తప్పించడంతోపాటు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2013లో క్వింటాలుకు సీసీఐ మద్దతు ధర రూ.3600 కాగా, ప్రతీ ఏడాది పెంచుతూ వస్తున్నారు. గతేడాది రూ.7,521 ఉండగా, ఈ ఏడాది రూ.8,110గా నిర్ణయించింది.

30 ఎకరాలు సాగు చేస్తున్నాను



1997లో 20 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. అప్పట్లో ఎకరానికి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు కౌలు ఉండేది. ఇప్పుడు ఎకరానికి రూ.20 వేల కౌలు చెల్లించాల్సి వస్తున్నది. నాన్ బీటీ విత్తనాలకు బదులుగా బీటీ విత్తనాలు రావడంతో పురుగు మందుల వాడకం తగ్గింది. గతంలో ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా మద్దతు ధరలు లేక ఇబ్బంది పడేవాళ్లం.

- బల్లగిరి నర్సింహారావు, రైతు

23 ఏళ్లుగా పత్తి సాగు చేస్తున్నాను



23 ఏళ్లుగా నేను పత్తి పంటను సాగు చేస్తున్నాను. గతంలో పత్తి ప్యాకెట్లు లూజుగా ఉండేవి. అప్పట్లో పురుగుల నుంచి పంటను రక్షించుకోవడానికి చాలా కష్టపడేవాళ్లం. బీటీ విత్తనాలు వచ్చినప్పటి నుంచి కొంత వరకు మేలు జరిగింది. గతంలో ఒక ఎకరం మాత్రమే వేసాను. ఇప్పుడు సొంత భూమితో పాటు కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని 10 ఎకరాల వరకు సాగు చేశాను.

-బండారి బాలరాజ్, రైతు, మల్లికార్జునపల్లి, మునిపల్లి మండలం





ఉపాధ్యాయులు హర్షవర్ధన్, శివప్రసాద్

బోధకుల నుంచి పరిశోధకులుగా!

● జగదేవ్‌పూర్ ఉపాధ్యాయుల ఘనత

జగదేవ్‌పూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు పరిశోధనలోనూ తమ సత్తా చాటేందుకు పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. జగదేవ్‌పూర్ మండలానికి చెందిన ఇద్దరు యువ ఉపాధ్యాయులు పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలో రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. తీగుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కర్రావుల హర్షవర్ధన్ రసాయనశాస్త్రంలో ప్రథమ ర్యాంకు సాధించగా, గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న బొల్లి శివప్రసాద్ తత్వశాస్త్రంలో ఆరో ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, పరిశోధనలపై ఉన్న ఆసక్తితో కష్టపడి చదివి ఈ విజయాన్ని అందుకున్నారు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారిద్దరిది సిద్దిపేట జిల్లాలోని బెజ్జంకి మండలం. హర్షవర్ధన్‌ది మండలంలోని పెరుకుబండ కాగా, శివప్రసాద్‌ది గుండారం గ్రామం. చిన్ననాటి నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లోని చదివి ఈ స్థాయికి చేరుకున్నారు. తీరిక సమయాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. తమ కష్టానికి ఫలితంగా రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించామని, తమ కల సాకారం కాబోతుందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

కొత్త పీర్ సవార్ ఉత్సవాలు



కొత్తపీర్ సవార్ ఉత్సవాల్లో భక్తులు

నర్సాపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దుర్‌లో మంగళవారం సాయంత్రం కులమతాలకు అతీతంగా కొత్తపీర్ సవార్ ఉత్సవాలు నిర్వహించారు. ప్రతి ఏటా పీర్ల పండుగ అయిన 9వ రోజు కాగజ్‌మద్దుర్‌లో హిందూ, ముస్లింలు కలిసికట్టుగా సోదరభావంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈసారి కూడా పీర్లను గ్రామస్థులంతా కలిసికట్టుగా ఊరేగింపు నిర్వహించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శేఖర్‌తో పాటు గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా గ్రామంలో హిందువులు సైతం తమ ఇళ్లకు బంధువులను పిలిపించుకుని పండుగలా నిర్వహించుకోవడం విశేషం. ఇది గ్రామంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది.

దళితులపై దాడులను ఉపేక్షించం

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న బక్కి వెంకటయ్య తదితరులు

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దళితులపై జరిగే దాడులను ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఇటీవల మెదక్ జిల్లా హవేలిఘనపూర్ మండలం బూర్గుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిరిజన ఉపాధ్యాయుడు నరేందర్ నాయక్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, గిరిజన శక్తి అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్, గిరిజన జేఏసీ నేత రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బక్కి వెంకటయ్య హాజరై మాట్లాడారు. రాజకీయాల ముసుగులో పాఠశాలలో చొరబడి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులపై దాడి చేయడం అమానుషమన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నరేందర్ నాయక్‌పై దాడి చేసిన బీజేవైఎం నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, నాయకులు శ్రీరాములు, రాజేందర్, అశోక్, సంజీవ్, వెంకటయ్య పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్లతో ఎత్తిపోతల పథకం

● పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్



జీవో కాపీని చూపుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్

జోగిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అందోలు నియోజకవర్గంలోని పెద్దారెడ్డిపేట వద్ద రూ. వెయ్యి కోట్లతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయనున్నట్లు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ఉపాధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో ఈ ఎత్తిపోతల పనులకు మరో రెండు నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని సంగమేశ్వర్ తెలిపారు. తలాపునే సింగూరు ప్రాజెక్టు ఉన్నా సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న అందోలు, ఉమ్మడి పుల్కల్, వట్‌పల్లి, రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల రైతులకు సాగునీరందించేందుకు మంత్రి దామోదర్ ఈ పథకాన్ని చేపట్టారని చెప్పారు. ఈ పథకం వల్ల ఆయా మండలాల్లోని 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని వివరించారు. కాగా, ప్రాజెక్టుకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్) పనుల కోసం రూ. 1.10 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 136ను విడుదల చేసిందన్నారు. ఎక్కడెక్కడ ఏయే పనులు చేయాలన్న విషయమై డీపీఆర్ సిద్ధం చేసి ఒక నెలరోజుల్లో ప్రభుత్వానికి అందజేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని, డీపీఆర్ పూర్తైన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన చేస్తారని, అనంతరం విడతల వారీగా అవసరమైన నిధులను మంజూరు చేస్తారని సంగమేశ్వర్ వెల్లడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సమావేశంలో జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, అక్సానపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు జీఆర్ నరేందర్‌రెడ్డి, జోగిపేట మాజీ సర్పంచ్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు పీ.రాంరెడ్డి, తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డేవిడ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షుడు శివరాజ్ యాదవ్ (అందోలు), నిమ్మ రమేశప్ప (టేక్మాల్), రమేశ్ జ్యోషి (వట్‌పల్లి), నాయకులు జీఆర్ మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అశోక్, శేఖర్, హన్మంతు, సైలాన, రాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేశాను.. క్షమించు అంబేద్కరుడా..!

● విగ్రహం వద్ద మద్యం తాగిన ఫలితం





అంబేద్కర్ విగ్రహానికి మొక్కుతున్న వ్యక్తి

కంది, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న జుల్‌కల్ గ్రామంలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. సోమవారం రాత్రి కొందరు అంబేద్కర్ విగ్రహం వద్ద మద్యం సేవించి ఖాళీ సీసాలను వదిలేశారు. మంగళవారం ఉదయం ఈ విషయం గ్రామస్థులు గమనించడంతో పాటు ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామానికి చెందిన ముగ్గురు అక్కడ మద్యం తాగినట్లు గ్రామస్థులు గుర్తించి ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు వారిలో ఒకరితో మంగళవారం ఉదయం అంబేద్కర్ విగ్రహానికి మొక్కి, క్షమాపణలు చెప్పించారు. అతను కూడా మళ్లీ ఇలాంటి తప్పు చేయనని గ్రామస్థులకు చేతులెత్తి నమస్కరించాడు. కాగా, ఆ వ్యక్తి అంబేద్కర్ విగ్రహానికి, గ్రామస్థులకు క్షమాపణలు చెప్పే దృశ్యాలను గ్రామస్థులు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో వైరల్ చేశారు. పోలీసుల జోక్యంతో ఈ వ్యవహారం సద్దుమణిగింది.

19న ఐఐటీహెచ్‌లో స్నాతకోత్సవం

● హాజరుకానున్న కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

కంది, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈ నెల 19న 14వ స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ స్నాతకోత్సవంలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీలలోని వివిధ విభాగాలకు చెందిన దాదాపు 1265 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో పాటు డిగ్రీ పట్టాలను అందజేయనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో మొదటిసారిగా పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులు పట్టాలు అందుకోవడం విశేషమని పేర్కొన్నారు.

క్షేత్ర సహాయకుల వేతనాలు పెంచాలని మంత్రి సీతక్కకు వినతి



మంత్రి సీతక్కను కలిసిన ఎంపీ సురేష్ షెట్కార్, క్షేత్ర సహాయకులు

నారాయణఖేడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులను ఫుల్‌టైం ఉద్యోగులుగా గుర్తించి వేతనాలను పెంచాలని వారు కోరారు. ఈ మేరకు మంగళవారం కామారెడ్డికి వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, క్షేత్ర సహాయకుల సంఘం బాధ్యులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గత 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ వన మహోత్సవం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ గృహాల సర్వే, స్వచ్ఛభారత్ మిషన్, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల పనుల పర్యవేక్షణతో పాటు పలు ప్రభుత్వ పనుల విజయవంతంలో భాగస్వాములవుతున్నారని వారు వివరించారు. పనికి తగ్గ వేతనాలను పెంచి తమకు న్యాయం చేయాలని కోరారు. ఎంపీ వెంట క్షేత్ర సహాయకుల సంఘం బాధ్యులు జ్ఞానరెడ్డి, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

ఆర్డీవోకు నిమ్జ్ అదనపు బాధ్యతలు



జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి

జహీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నిమ్జ్ అధికారిగా ఆర్డీవో రాంరెడ్డికి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు నిమ్జ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా కొనసాగిన రాజిరెడ్డి ఇటీవల ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఆ స్థానం ఖాళీ అయింది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఆర్డీవోగా కొనసాగుతున్న రాంరెడ్డికి నిమ్జ్ అధికారిగా ఈ అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో రాంరెడ్డి ఒకవైపు ఆర్డీవో బాధ్యతలు, మరోవైపు నిమ్జ్ ప్రత్యేక అధికారి, ఇంకోవైపు మున్సిపల్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన పరిధిలో లేని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ, నిమ్జ్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే నేరుగా కార్యాలయానికి వచ్చి నిర్భయంగా చెప్పుకోవచ్చని ప్రజలకు సూచించారు.



కేంద్ర బృందం సభ్యులను సన్మానిస్తున్న మహిళ సంఘం సభ్యులు

రేగులపల్లిలో కేంద్ర బృందం పర్యటన

● ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలన

బెజ్జంకి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండలం రేగులపల్లి గ్రామాన్ని మంగళవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 12 రకాల పథకాల అమలు తీరును పరిశీలించారు. ముఖ్యంగా, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి, మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించిన రుణాల సద్వినియోగం గురించి ఆరా తీశారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన బెజ్జంకి 8 రేగులపల్లి రోడ్డు, నర్సరీ, డంపింగ్ యార్డును బృందం సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు, ఐకేపీ ఏపీఎం నర్సయ్య, సీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

● ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఆనంద్



బెజ్జంకి కేజీబీవీలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్

బెజ్జంకి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, విద్యార్థులు, బాలింతలు, గర్భిణులకు విధిగా పౌష్టికాహారం అందించాలని ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వీరాపూర్ అంగన్‌వాడీ కేంద్రం, బేగంపేట ఉన్నత పాఠశాల, బెజ్జంకిలోని అంగన్‌వాడీ, కేజీబీవీ, ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బెజ్జంకి పీహెచ్‌సీలో ప్రసూతి సేవల గురించి మెడికల్ ఆఫీసర్ మాధురిని అడిగి తెలుసుకున్నారు కేజీబీవీలో విద్యార్థినులకు రక్తశాతం తక్కువగా ఉండటం, సరైన పౌష్టికాహారం అందకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ సరఫరా చేస్తున్న కోడిగుడ్లు, పండ్లు, కూరగాయలు నాణ్యత లేవని స్పష్టం చేశారు. ఈ విషయమై డీఈవో శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన ఆనంద్, సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, చెల్లింపులను రికవరీ చేసి, రికవరీ రిపోర్టును ఫుడ్ కమిషన్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆహార భద్రత కమిషన్ సభ్యురాలు భారతి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈవో మహతి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

● దళిత సంఘాల డిమాండ్



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

మెదక్, కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రెలి అనిల్ కుమార్‌ను హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని మెదక్ జిల్లా దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గుల్షన్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ యువజన నాయకుడు అనిల్ కుమార్ హత్య వెనుక ఉన్న రాజకీయ కుట్ర కోణాన్ని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని, ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నాయకులుగా ఎదుగుతున్న దళితులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను త్వరగా పట్టుకుని శిక్షించకుంటే ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ మాదిగ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, మందకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆస్రగల్ల బాల్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ మెదక్ పట్టణ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ గంటరాజు, మేకల రవి, రాజు, మహేష్, ఉషస్‌గల్ల, బాబయ్య, నాయకులు బాబు మహేందర్, సుధాకర్, శ్రీనివాస్, ప్రవీణ్, యోహాన్ జాన్, ప్రతాప్, కుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో గౌతంకుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, సోషల్, గణితం, హిందీ సబ్జెకులు బోధించుటకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకానికి 19లోగా సంగారెడ్డిలోని ఆర్‌సీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ, బీఈడీ విద్యార్హత కలిగి ఉండి 50 శాతం మార్కులు కలిగిన వారే అర్హులని తెలిపారు. వివరాలకు 9441250450 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే బీసీ రిజర్వేషన్

నర్సాపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసమే బీసీ రిజర్వేషన్‌పై ఆర్డినెన్స్ తెచ్చిందే తప్పా.. చిత్తశుద్ధితో అమలు చేయాలని కాదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ డీ.అశోక్‌గౌడ్ విమర్శించారు. మంగళవారం నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నందున హడావిడిగా ఆర్డినెన్సు తెచ్చింది.. కానీ బీసీలపై ప్రేమతో కాదన్నారు.

ఇందిరమ్మ గృహాల నమూనా పరిశీలన

నారాయణఖేడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణ శివారులోని ఎంపీపీ కార్యాలయం సమీపంలో ఇందిరమ్మ ఇంటి నమూనాను గృహ నిర్మాణశాఖ డీఈ సతీష్ తివారి మంగళవారం పరిశీలించారు. నాణ్యత, నిర్దేశిత నమూనా ప్రకారం నిర్మిస్తున్నారా.. లేదా అని పరిశీలించి, మేస్త్రీలకు పలు సూచనలు చేశారు.

డీసీసీబీ ద్వారా అధిక వడ్డీ

నారాయణఖేడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులకు మెరుగైన సేవఅందించడంతో పాటు అన్ని బ్యాంకులకంటే డిపాజిట్లపై డీసీసీబీ అధిక వడ్డీ చెల్లిస్తుందని జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఖేడ్ శాఖ మేనేజర్ వెంకటేశం తెలిపారు. ఖేడ్, నిజాంపేట మండలాల పరిధిలోని మేగ్యా నాయక్‌తండా, దర్గాతండాల్లో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజివ్ సాచురేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి

నారాయణఖేడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో డ్రైవర్లు, వాటర్‌మెన్లు, ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ జగ్జీవన్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

పిల్లలకు వ్యాయామం తప్పనిసరి

టేక్మాల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు ప్రతీరోజు ఆహారం తీసుకున్న తర్వాత కొంతసేపు వ్యాయామం చేయించాలని వైద్యాధికారులు శ్రీనివాస్, ఝాన్సీ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన టేక్మాల్‌లో మోడల్ పాఠశాలలోని విద్యార్థులకు గ్రామ ఆరోగ్యశాఖ సిబ్బంది, రాష్ట్రీయ బాలస్వస్థ(ఆరోగ్య) కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను పరిశీలించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బీమాతో ప్రజలకు.. ధీమా

చిన్నశంకరంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బీమాతో ప్రజలకు ధీమా ఉంటుందని ఎస్‌బీఐ మేనేజర్ సుధీర్ అన్నారు. చిన్నశంకరంపేట మండలం చెన్నాయిపల్లి గ్రామానికి చెందిన భానుచందర్ కొన్నిరోజుల క్రితం కుటుంబ కలహాలతో మృతిచెందాడు. గతేడాది గవ్వలపల్లి ఎస్‌బీఐ బ్యాంకులో ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన పథకం కింద సంవత్సరానికి రూ.436 బీమా పాలసీ కట్టుకున్నాడు. ఆయన మృతితో బ్యాంకు మేనేజర్ బాధిత కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును మంగళవారం అందజేశారు.

వెంకట్రాంరెడ్డికి చెక్కు అందజేత

శివ్వంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ ఆడిటోరియంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతుల శ్రేయస్సు కోసం ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ కార్యక్రమం నిర్వహించారు.

17న టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా కార్యవర్గ సమావేశం

సంగారెడ్డి రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జిల్లా కార్యవర్గ సమావేశం 17న సంగారెడ్డిలో నిర్వహిస్తున్న ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరి, విష్ణు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నామన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఉపాధ్యక్షుడు ఫైజల్, ప్రధాన కార్యదర్శి రామనారాయణ ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా న్యాయం జరగడం లేదన్నారు. నాయకులు, జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

కళావిహీనంగా ట్యాంక్‌బండ్

- కోట్లు వెచ్చించి పనులు.. మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- పిచ్చి మొక్కలతో నిండిన ఫుట్‌పాత్
- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు



మినీ ట్యాంక్‌బండ్‌పై పడేసిన గ్లాసులు, నీళ్ల బాటిళ్లు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు నిధుల లేమి.. మరోవైపు మంజూరు హామీ.. వెరసి మెదక్ జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ కళావిహీనంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణాల్లోని చెరువులను మినీట్యాంక్ బండ్లుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలోని పిట్లం, గోసముద్రం చెరువులు కలిసి ఉండటంతో మినీట్యాంక్ బండ్‌గా ఏర్పాటు చేసేందుకు అప్పట్లో రూ.9.30 కోట్లు మంజూరు చేశారు. సదరు కాంట్రాక్టర్ ట్యాంక్ బండ్ విస్తీర్ణం పెంచడంతో పాటు పలు నిర్మాణ పనులను పూర్తిచేశారు. కానీ నిధులు సరిపోకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ విషయంలో అప్పటి కలెక్టర్ హరీశ్ తిరిగి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. దంతో ట్యాంక్బండ్‌కు ఇరువైపులా ఫుట్‌పాత్, గజీబో వుడ్ రెయిలింగ్, ఎనిమల్ చైర్స్, హట్స్ నిర్మించేందుకు ఆదేశాలు జారీ చేశారు. అప్పటి పాలకుల ఒత్తిడి మేరకు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు రాకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిపేశారు. సుమారు 30 నెలలుగా తమకు ఎటువంటి మంజూరీపత్రం ఇవ్వలేదని, తామెలా ముందుకెళ్తామని వాపోతున్నారు. రెండో దఫాగా సుమారు రూ.9 కోట్లకు పైగానే ప్రతిపాదనలు చేశామని పర్యాటక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే రెండో దఫా నిధుల జీవో ఇంతవరకూ రాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, పాలకులు స్పందించి మెదక్ పట్టణ మినీట్యాంక్‌కు ప్రతిపాదిత నిధుల మంజూరుపై దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న చంద్రశేఖర్

హత్నూర, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రమైన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. వసతి గృహంలోని పరిసరాలను, విద్యార్థులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు వండి పెట్టడానికి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను చూసి సిబ్బందిపై ఆగ్రహ వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పోషక లోపం ఉన్న పిల్లల పట్ల శ్రద్ధ చూపాలి

- మెదక్ జిల్లా సంక్షేమాధికారి హైమావతి



రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న హైమావతి

నర్సాపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పోషకలోపం ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని మెదక్ జిల్లా సంక్షేమాధికారి హైమావతి సూచించారు. మంగళవారం నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో హేమభారతితో కలిసి తనిఖీ చేసి మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 0 నుంచి 5 ఏళ్లలోపు పిల్లల్లో ఆరోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఖాళీ స్థలం ఉంటే అక్కడే న్యూట్రీ గార్డెన్ పెంచి ఆకుకూరలు, కూరగాయలు వేసుకోవాలని సూచించారు.

పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలి

- మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్



తెలుగు పండిట్ రూపొందించిన పాఠ్య ప్రణాళికలను విడుదల చేస్తున్న రాధాకిషన్

పాపన్నపేట జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి విద్యావేత్తలు, దాతలు సహాయ సహకారాలు అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో చ్చి, పెద్ద హరిజన గడ్డతో పాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, వాటర్ బాటిల్స్ పెన్నులు, పెన్సిళ్లు ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్‌తో కలిసి అందజేశారు. వీటిని అమెరికా దేశ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా వ్యక్తిగత వైద్యుడు మన్నే ఉపేందర్ తమ సొంత డబ్బులతో అందించారు. ఉపేందర్ పాపన్నపేట ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అవడం గమనార్హం. అనంతరం పాఠశాల రికార్డులను, ఉపాధ్యాయుల అటెండర్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్ పనితీరును అభినందించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు అంజాగౌడ్, నాగరాజు, రమేష్, సుభాష్ తదితరులున్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



సభ్యత్వ నమోదు పత్రాలు అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

మునిపల్లి/నాగల్‌గిద్ద, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమౌళి, సురేందర్‌తో కలిసి మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి, సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల నాయకులు ఉమేష్, శ్రీనివాస్ రెడ్డి, వీరయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండలం మోర్గి మోడల్ పాఠశాలలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి నాగ్‌నాథ్‌ల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

విశేష సేవలే గుర్తింపునిస్తాయి : ఎస్పీ పంకజ్



ఎస్‌ఐలు షేక్ షాబొద్దీన్, మల్లయ్యను సన్మానిస్తున్న ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని, ఉద్యోగ సమయంలో చేసిన విశేష సేవలే గుర్తింపునిస్తాయని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. ఎస్‌ఐలు షేక్ షాబొద్దీన్, కె.మల్లయ్య ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వారిని సన్మానించి, మాట్లాడారు. షాబొద్దీన్, మల్లయ్య పోలీస్‌శాఖలో 42 ఏళ్లు ఉమ్మడి మెదక్ జిల్లాల్లో పనిచేసి ఎంతో సేవచేశారన్నారు. పోలీస్‌శాఖ నుంచి వారికి రావాల్సిన బెనిఫిట్స్‌ను అందజేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, డీఎస్పీ శ్రీనివాస్ రావు, ఆర్ఐ డానియల్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

సంగారెడ్డి రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట మంగళవారం కార్మిక సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ పటాన్‌చెరు పారిశ్రామికవాడైన పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే భారీ ప్రమాదం జరిగి 45 మంది కార్మికులు మృతిచెందారన్నారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. పరిశ్రమలను తనిఖీలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగం, యాదగిరి, సురేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు గుర్తించడానికి మార్నింగ్‌వాక్ : కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో సమస్యలు గుర్తించడానికి అధికారులతో మార్నింగ్‌వాక్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి పాషానగర్ కాలనీలో మార్నింగ్ వాక్ విత్ అఫీషియల్స్ కార్యక్రమం నిర్వహించారు. బహిరంగ కాలువల్లో ఎప్పటికప్పుడు శుభ్రత చేయకపోవడం వల్ల కాలువల్లో నీరు నిండి ఇళ్లల్లోకి చేరుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. కాలనీ ప్రవేశ ద్వారం సమీపంలో ఇష్టారీతిన వ్యర్థాలు పారబోస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విజయమోహన్, పవన్, విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు ఛాంద్, రఫీక్, నవీన్‌గౌడ్, శ్రీను, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులకు దోమలే ప్రధాన వాహకాలు

పటాన్‌చెరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అనేక వ్యాధులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోమలే ప్రధాన వాహకాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్‌లోని బాలుర పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

మహిళా ఉత్పత్తుల ప్రదర్శన

రామయంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వెలుగు మహిళలు సొంతంగా తయారుచేసిన ఉత్పత్తులను రామాయంపేటలోని కూరగాయల మార్కెట్ వద్ద ప్రదర్శనగా ఉంచారు. పలురకాల వస్తువులను స్టాల్స్‌లో ఉంచగా.. స్థానికులు తరలివచ్చి కొనుగోలు చేశారు. ఈ మేరకు మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ చేరుకొని ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులను చూసి అభినందించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చేగుంట ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.4.50 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటిని పరిశీలించి, మాట్లాడారు. చేగుంట మండలానికి 570 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అందులో చాలామంది పనులు ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు కుర్మ లక్ష్మి, రెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ మేకల పరమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, మాజీ సర్పంచ్ భాస్కర్, జగన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

'ఓపెన్ స్కూల్ వరం లాంటిది'

పుల్‌కల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మధ్యలో చదువు మానేసిన అభ్యర్థులకు ఓపెన్ స్కూల్ వరంలాంటిదని చౌటకూర్ మండలం శివంపేట జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ తెలిపారు. స్థానిక పాఠశాలలో మంగళవారం ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈనెల 31వ తేదీవరకు అపరాధ రుసుము లేకుండా, ఆగస్టు 28 వరకు అపరాధ రుసుముతో అడ్మిషన్లకు గడువు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీ.మల్లేశం ఖదీర్, ఎస్.రాములు, రాములు, సునీతబాయి పాల్గొన్నారు.

మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేయాలి : జడ్పీ సీఈవో



తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో మొక్కలు నాటుతున్న ఎల్లయ్య

తూప్రాన్/నర్సాపూర్/జహీరాబాద్/ జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నిర్దేశంచిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి అటవీ భూముల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ టేక్మాల్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్, అటవీశాఖ సెక్షన్ అధికారి ఓంకార్, బీట్ ఆఫీసర్ చిరంజీవి, కార్యదర్శి మహేశ్వరీ పాల్గొన్నారు. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో నర్సాపూర్ అటవీశాఖ రేంజ్ అధికారి అరవింద్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అదెప్ప, నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ రాంచరణ్‌రెడ్డి, అటవీశాఖ సెక్షన్ అధికారి సాయిరామ్ పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చింతల హరికుమార్ మొక్కలు నాటారు. కళాశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు.

స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి

చిన్నశంకరంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించాలని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, ఎంపీపీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించి, మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని, ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

పేలిన తూటా

(5వ పేజీ తరువాయి)

రెండు ఛాతీ, భుజంపై బుల్లెట్ గాయాలున్నాయి. సంఘటనా స్థలాన్ని ఐజీ చంద్రశేఖరరెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావులు పరిశీలించారు.

నేడు పుట్టిన రోజు

యువ నాయకుడైన అనిల్ 28వ పుట్టినరోజు బుధవారం జరగాల్సి ఉంది. ఈ విషయం అనిల్ తల్లి యేసమ్మ ఆస్పత్రి మార్చురీ వద్ద రోదిస్తూ తెలిపింది. సోమవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉందంటే ప్రభువుకు ప్రార్థన చేసి పంపించానని, ఇలా శవమై వస్తాడని ఊహించలేదని తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అనిల్ మృతి విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు మెదక్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్దకు వచ్చారు. అనిల్ కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

బీసీల మహాధర్నాలో సంగారెడ్డి ఎమ్మెల్యే



హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో మంగళవారం బీసీ నాయకులు నిర్వహించిన బీసీల మహాధర్నాలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. ఆయన వెంట ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బిక్షపతి, మామిళ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

సంగారెడ్డి అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో పలువురు జూనియర్ కాలేజీ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి దక్కింది. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గణితం లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.విజయశేఖర్‌కు కామారెడ్డి జిల్లా పిట్లం కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. పటాన్‌చెరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న లక్ష్మీప్రసన్నకు మనూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించింది. జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.కృష్ణారావుకు కల్హేర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి దక్కింది. జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న వి.ఐలయ్య సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించింది. సదాశివపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎల్.స్వామి నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. సదాశివపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.విజయలక్ష్మీ రాజన్నసిరిసిల్ల జిల్లాలోని చందుర్తి జూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్ పదోన్నతి పొంది బదిలీ అయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు.

మంత్రిని కలిసిన కరాటే బృందం

మనోహరాబాద్/టేక్మాల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ దామోదర్ రాజనర్సింహను నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ బృందం ఆయన నివాసంలో మంగళవారం కలిసింది. ఈ సందర్భంగా మంత్రి 2025 నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ కప్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. 27న మేడ్చల్‌లో నిర్వహించే డైనమిక్ షోటోకాన్ కరాటేకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. ఇందులో మాజీ పీసీసీ రాజీవ్‌గాంధీ, పంచాయతీరాజ్ సంఘటన్ రీజినల్ కన్వీనర్ కనిగిరి లింగం, కరాటే మాస్టర్లు సాయికుమార్, సురేష్, శ్రీనివాస్, ఇంద్రసేన, జనార్దన్, శ్రీరాములు, శంకర్ ఉన్నారు. అలాగే టేక్మాల్‌లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో మంత్రి దామోదర్, ఆయన తనయ పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో చేరి దేశ సేవలో భాగం కావాలి

పాపన్నపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశ సేవలో భాగం కావాలని ఆర్మీ సుబేదార్ బిక్రమ్‌సింగ్, హవల్దార్ అమిత్ సైని సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఇన్‌చార్జిలు ప్రవీణ్‌కుమార్, శ్రావణ్‌తో కలిసి క్యాడెట్లను ఎంపిక చేశారు. వివిధ పోటీలు నిర్వహించి 47 మంది విద్యార్థులను ఎన్‌సీసీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదాశివపేటలో ఘనంగా బోనాలు



సదాశివపేటలోని గురునగర్ కాలనీ బోనాలలో ఏఎంసీ వైస్ చైర్మన్ కంది కృష్ణగుప్తా తదితరులు

సదాశివపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీవాసులు మంగళవారం సామూహిక దుర్గాభవాని బోనాలు నిర్వహించారు. ఉత్సవాల్లో కళాకారుల ప్రదర్శనలు, పోతరాజుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణగుప్తా, మాజీ కౌన్సిలర్లు సాతాని శ్రీశైలం, సాతాని లలిత, నాగరాజుగౌడ్, శంకర్‌గౌడ్, గుండు రవి, కాంగ్రెస్ యూత్ నాయకులు శరత్‌చంద్ర గుప్తా పాల్గొన్నారు.

కట్టమైసమ్మ హుండీ ఆదాయం రూ.1.25 లక్షలు

నారాయణఖేడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని ఆలయ కమిటీ బాధ్యులు ప్రభుయాదవ్, సాయి సంగమేశ్వర్, రవికుమార్, కిషన్‌పంతులు లెక్కించారు. ఆదివారం నిర్వహించిన బోనాలలో భాగంగా భక్తులు హుండీలో సమర్పించిన మొత్తం రూ.1,25,850 లక్షలు వచ్చిందని చెప్పారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామని తెలిపారు.

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

జహీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్‌లోని హోతి(కే)లో నిర్మితమైన 660 డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల జాబితాను తహసీల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులు సర్టిఫికెట్లు తీసుకుని ఆయా కార్యాలయాలకు వచ్చి పేర్లను చెకిచేసుకున్నారు. లబ్ధిదారుల సౌకర్యార్థం జాబితాను అందుబాటులో ఉంచామని తహసీల్దార్ దశరథ్ తెలిపారు. అభ్యంతరాలు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. తదుపరి విచారణ చేపట్టి పంపిణీ ప్రక్రియ వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

'బదిలీలతో కూడిన ప్రమోషన్లు చేపట్టాలి'

చిలప్‌చెడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బదిలీలతో కూడిన ప్రమోషన్లు చేపట్టాలని ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎస్టీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సుభాష్, మండల అధ్యక్షుడు వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి మహేష్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.